సాక్షి
పెద్దపల్లి
ఆదివారం । 24 । సెప్టెంబర్ । 2023

సెల్ఫీ విత్ మట్టిగణేశుడు

సాక్షి పెద్దపల్లి: పర్యావరణాన్ని కాపాడేలా మట్టిగణేశుడిని ప్రతిష్ఠించారా.. ప్రత్యేక ఆకృతుల్లో అపార్ట్‌మెంట్ కమ్యూనిటీ లేదా ఇళ్లలో మట్టి గణపతులను పూజిస్తున్నారా.. అయితే మీరు పర్యావరణహిత గణేశుడితో సెల్ఫీ ఫొటో తీసుకుని సెల్ నంబరు 97002 15216కు వాట్సాప్ చేయండి. మీరు పంపిన ఫొటోను 'సాక్షి' దిన పత్రికలో ప్రచురిస్తాం.



ఆశలపై మళ్లీ నీళ్లు

- గ్రూప్ -1 రద్దుపై అభ్యర్థుల ఆగ్రహం
- పరీక్షకు హాజరైన వారు 3,753



లైబ్రరీలో ప్రిపేరవుతున్న నిరుద్యోగులు

సాక్షి, పెద్దపల్లి: అప్పులు చేసి, లక్షలు ఖర్చు చేసి.. తినీతినక అనేక కష్టాలు భరిస్తూ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని ఏళ్లుగా ప్రిపేరవుతున్న నిరుద్యోగులు.. గ్రూప్– వన్ పరీక్ష రద్దుపై మండిపడుతున్నారు. నిరుద్యోగులు, పరీక్షల నిర్వహణపై సర్కార్‌కు చిత్తశుద్ధి లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించని సర్కార్, టీఎస్ పీఎస్సీ ఎందుకని నిలదీశారు. కమిషన్ చైర్మన్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. విలువైన సమయం, అమ్మానాన్నల కష్టార్జితం కోల్పోయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

జిల్లాలో 3,753 మంది హాజరు

- జూన్ 11న జిల్లాలోని 16 కేంద్రాల్లో గ్రూప్–1 ప్రిలిమ్స్ నిర్వహించారు. 3,753 మంది పరీక్షకు హాజరయ్యారు.
- అయితే, గ్రూప్–1 ప్రిలిమినరీని రద్దు చేసిన హైకోర్టు.. తిరిగి నిర్వహించాలని టీఎస్ పీఎస్సీని ఆదేశించింది.
- వివిధ ప్రభుత్వ శాఖల్లో 503 గ్రూప్–1 పోస్టుల కోసం గతేడాది టీఎస్ పీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసి.. అక్టోబరు 16న ప్రిలిమినరీ నిర్వహించడంతోపాటు ఫలితాలనూ వెల్లడించింది.
- అయితే ప్రశ్నాపత్రం లీకైనట్లు దర్యాప్తులో తేలడంతో అక్టోబరు 16నాటి పరీక్ష రద్దు చేసి.. జూన్ 11న తిరిగి నిర్వహించింది.
- బయోమెట్రిక్, హాల్‌టికెట్ నంబర్ లేకుండానే పరీక్ష నిర్వహించడంతో ఇప్పుడు ఆ పరీక్షను సైతం హైకోర్టు రద్దు చేసింది.
- దీంతో అభ్యర్థులు కమిషన్ తీరుపై మండిపడుతున్నారు.

చైర్మన్ రాజీనామా చేయాలి



గ్రూప్స్ కోసం ఐదేళ్లుగా ప్రిపేరవుతున్న. హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకున్న. అక్కడ ఖర్చులు అధికంగా ఉండడంతో పెద్దపల్లికి వచ్చి ప్రిపేరవుతున్న. గతంలో ఓసారి గ్రూప్– వన్ రద్దు కాగా, మరోసారైనా పరీక్షలు సరిగా నిర్వహించలేదు. హైకోర్టు మరోసారి పరీక్ష రద్దు చేసి నిర్వహించాలని చెప్పింది. దీనికి బాధ్యత వహిస్తూ కమిషన్ రాజీనామా చేయాలి.

– అనూష, అప్పన్నపేట, పెద్దపల్లి

ప్రభుత్వ నిర్లక్ష్యమే



ఒక్క మద్యం దుకాణల టెండర్లు తప్ప మిగతా అన్ని ఉద్యోగాల నోటిఫికేషన్లు కోర్టుకు పోయాయి. ప్రభుత్వానికి నిరుద్యోగులపై ఉన్న శ్రద్ధ ఏమిటో దీంతోనే అర్థమవుతుంది. ఇప్పటికైనా కమిషన్‌ను ప్రక్షాళన చేసి సమర్థవంతంగా పరీక్ష నిర్వహించే వారికి బాధ్యతలు అప్పగించాలి.

– ఎస్.కిషన్, ధర్మబాద్, ముత్తారం

సర్కార్ ఆదుకోవాలి



మా ఉద్యోగాలు మాకే దక్కుతాయని ఆశపడ్డ నిరుద్యోగులకు తీవ్ర నిరాశ ఎదురవుతోంది. తల్లిదండ్రులు ఇచ్చే పైసలు సరిపోక, అప్పులు చేసి కోచింగ్, మెటీరియల్ కొనుక్కొని సంవత్సరాల కొద్దీ చదువుతున్న వారు హైకోర్టు తీర్పుతో మరింత ఆర్థికంగా, మానసికంగా నష్టపోయే అవకాశం ఉంది. ప్రభుత్వం అభ్యర్థులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలి. –సతీశ్, సుల్తానాబాద్

అప్పు చేసి చదువుతున్నం



చదువులు పూర్తిచేశాక ప్రైవేట్ ఉద్యోగాలు చేసుకోకుండా, ప్రభుత్వ ఉద్యోగం సాధించి అమ్మానాన్నలను మంచిగా చూసుకుందాం అనుకున్నం. కానీ ప్రభుత్వం నిర్లక్ష్యం, కమిషన్ తప్పిదాలతో అప్పులు చేసి ఉద్యోగాల కోసం ప్రిపరేషన్ అవుతున్న వారు మరిన్ని అప్పుల పాలవడం ఖాయం.

–మచ్చ శ్రవణ్ కుమార్, నాగరం, మంథని

మూడేళ్లు ప్రిపేరైన



మూడేళ్లు గ్రూప్స్‌కు ప్రిపేరైన. పరీక్షలు రాశాక ప్రభుత్వ వైఫల్యంతో రద్దయ్యాయి. గ్రూప్– వన్ సాధించాలనే లక్ష్యంతో ప్రైవేట్ జాబ్ మానుకొని అమ్మానాన్నల కష్టంతో ప్రైవేట్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రిపేర్ అయ్యా. – నవీన్, కాల్వ శ్రీరాంపూర్

కూతురు భారం కాదు.. ఆమెను ప్రోత్సహిస్తే కుటుంబానికి అండగా నిలుస్తూ ఇంటికి వెలుతురునిస్తుంది. ఇంట్లో ఆడపిల్ల పుట్టగానే బరువు అనుకునేవారికి ఆ భావన తప్పు అని నిరూపిస్తున్నారు నేటి అమ్మాయిలు. కళలు, క్రీడలు, చదువులు, ఉద్యోగాల్లో రాణిస్తూ మగవాళ్లకు తామేమీ తీసిపోమని నిరూపిస్తున్నారు. తల్లిదండ్రులకు తమను చూసుకునే కొడుకుల్లేరనే బాధను మర్చిపోయేలా చేస్తున్నారు. వారి ఆశలను తీరుస్తూ.. కలలను నిజం చేస్తూ ఇంట్లో ఆనందాన్ని పంచుతున్నారు. నేడు అంతర్జాతీయ కూతుళ్ల దినోత్సవం. ఈ సందర్భంగా పలువురు తమ మనోభావాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

కూతురు.. ఇంటికి వెలుతురు



- ఆడపిల్ల భారం కాదు.. ప్రోత్సహిస్తే అండగా నిలుస్తుంది
- కళలు, క్రీడలు, చదువులు, ఉద్యోగాల్లో రాణిస్తున్న పలువురు
- నేడు అంతర్జాతీయ కూతుళ్ల దినోత్సవం

ముగ్గురూ ఉద్యోగులే



కూతుళ్లతో కిష్టయ్య-సత్తమ్మ దంపతులు

కథలాపూర్(వేములవాడ): మెట్‌పల్లి మండలంలోని జగ్గాసాగర్ గ్రామానికి చెందిన మండల కిష్టయ్య-సత్తమ్మ దంపతులకు ముగ్గురు కూతుళ్లు సరిత, సవిత, కీర్తి ఉన్నారు. వ్యవసాయం, కూలీ పనులు చేస్తూ పిల్లలను ఉన్నత చదువులు చదివించారు. సరిత పీజీ, బీఎడ్ పూర్తి చేసి, పంచాయతీ కార్యదర్శి ఉద్యోగం సాధించి, ఇబ్రహీంపట్నం మండలంలో విధులు నిర్వహిస్తోంది. సవిత డిగ్రీ పూర్తి చేసి ప్రైవేట్ టీచర్‌గా పని చేస్తోంది. కీర్తి 2020లో పోలీస్‌శాఖలో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించి, కథలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తోంది. తాము కూతుళ్లనే కొడుకులు భావించి, ఉన్నత చదువులు చదివించామని, వారు కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించడంతో తమ కల నెరవేరిందని ఆ దంపతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కష్టపడి లక్ష్యం చేరుకున్నా..



జగిత్యాల కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: మాది ప్రకాశం జిల్లా. నేను హైదరాబాద్‌లో పుట్టి, పెరిగాను. మేం నలుగురు అక్కాచెల్లెల్లం. నాన్న షేక్ యూసుఫ్ పాషా ఎక్స్ సర్వీస్‌మెన్, తల్లి షబీరా హౌస్ వైఫ్. నలుగురు కూతుళ్లలో నేనే పెద్దదాన్ని. పెళ్లి జరిగి, ఇద్దరు పిల్లలు పుట్టాక ఇంటి వద్దే ఉంటూ వంట చేయడం, పిల్లలను చూసుకోవడం వంటివే జీవితం అనుకోలేదు. కష్టపడి చదివి, లక్ష్యాన్ని చేరుకున్నాను. 2003లో గ్రూప్–1 రాసి, ఎంపీడీవోగా, 2009లోనూ రాసి, డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యాను. 2011లో మహబూబ్‌నగర్‌లో ఉద్యోగ బాధ్యతలు చేపట్టాను. 2016లో రాజన్న సిరిసిల్ల జిల్లాకు జాయింట్ కలెక్టర్‌గా వచ్చాను. 2020లో వనపర్తికి కలెక్టర్‌గా వెళ్లాను. ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటిన జగిత్యాల కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టాను. పెద్ద చెల్లెలు నజీబీ లండన్‌లో స్థిరపడగా రెండో చెల్లెలు పర్వీన్ టీఎస్ ఎస్‌లో మంచి పొజిషన్‌లో ఉంది. చిన్న చెల్లెలు బీఫార్మసీ పూర్తి చేసి ఉద్యోగం చేస్తోంది. అమ్మానాన్న అందరూ ఆడపిల్లలే అని బాధ పడలేదు. చదువుల్లో ప్రోత్సహిస్తూ మా వెన్నంటి ఉన్నారు. వారి వల్లే మేము ఈ పొజిషన్‌లో ఉన్నాం. తల్లిదండ్రులను ఎప్పుడూ గౌరవించాలి.

మా కల నిజం చేసింది



కూతురు శివానితో టీచర్ కుమ్మరి మల్లేశం

సిరిసిల్లకల్చరల్: మాది సిరిసిల్ల. మా అమ్మాయి శివాని పదోతరగతి నుంచి చదువుల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ చాటుతూ ముందుకు సాగుతోంది. పదోతరగతిలో జిల్లా టాపర్‌గా నిలిచింది. ఇంటర్మీడియట్‌లో 968 మార్కులు సాధించింది. బీటెక్ ఈసీఈ పూర్తి చేసి, ప్రస్తుతం ఓ కంపెనీలో ఏడాదికి రూ.32 లక్షల ప్యాకేజీతో సాఫ్ట్‌వేర్‌గా ఉద్యోగిగా పని చేస్తోంది. అమ్మాయి మా కల నిజం చేసినందుకు సంతోషంగా ఉంది.

పేద కుటుంబంలో పుట్టాం



అక్క రాజమణి, చెల్లె జ్యోతితో అరుణశ్రీ

పెద్దపల్లిరూరల్: మాది జగిత్యాల జిల్లా కొడిమ్యాల గ్రామం. మేము ముగ్గురం అక్కాచెల్లెళ్లం. పేద కుటుంబంలో పుట్టాం. అమ్మానాన్న జడల రామస్వామి, లక్ష్మి. నాన్న ఇంటివద్దే దుస్తులు అమ్మి, కుటుంబాన్ని పోషించేవారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే చదువుకున్నాం. ఉద్యోగం సాధించాలన్న పట్టుదలతో ఉన్న మమ్మల్ని అమ్మానాన్న ప్రోత్సహించారు. అక్క రాజమణి ఎమ్మెస్సీ కెమిస్ట్రీ చదివి, ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా కరీంనగర్‌లో పని చేస్తోంది. నేను 2012లో ఐఏఎస్ సాధించా. ప్రస్తుతం పెద్దపల్లి అడిషనల్ కలెక్టర్‌గా పని చేస్తున్నా. భర్త శ్రీనివాస్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు. ఇద్దరు అహిలన్, అభిషన్ సంతానం. చెల్లెలు జ్యోతి హైదరాబాద్‌లో బ్యాంకింగ్ రంగంలో అకౌంట్స్ ఆఫీసర్‌గా పని చేస్తోంది. నాలుగు మాసాల క్రితం నాన్న చనిపోవడం తీరని బాధను మిగిల్చింది.



చెల్లెళ్లతో కోరుట్ల ఏవో నాగమణి (మధ్యలో)

అమ్మ గర్వపడుతోంది

కోరుట్ల రూరల్: మా స్వగ్రామం మేడిపల్లి మండలంలోని తొంబర్‌రావు పేట. కోరుట్లలో స్థిరపడ్డాం. మేము ముగ్గురం అక్కాచెల్లెళ్లం. నాన్న బుచ్చిలింగం గల్ఫ్ కార్మికుడు, అమ్మ లక్ష్మి బీడీ కార్మికురాలు. పిల్లలు ఆడవాళ్లనే భావన ఎప్పుడూ వారిలో చూడలేదు. అందరినీ ఉన్నత చదువులు చదివించారు. నేను బీఎస్సీ అగ్రికల్చర్ చదివి, వ్యవసాయ అధికారి ఉద్యోగం సాధించాను. చెల్లెళ్లు విశాల, రమ్య పీజీ పూర్తి చేసి, ప్రస్తుతం ప్రైవేటు ఉద్యోగం చేస్తూ ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రయత్నిస్తున్నారు. నాన్న గల్ఫ్ నుంచి వచ్చి, అనారోగ్యం బారిన పడినా అమ్మ బీడీలు చుట్టి, మా చదువులు పూర్తి చేయించింది. ప్రస్తుతం ప్రయోజకులుగా మారిన మమ్మల్ని చూసి, మా అమ్మ గర్వపడుతోంది.

చెత్త తొలగించండి..

- దోమలు నివారించండి
- నేనూ మీ వెంటే క్షేత్రస్థాయికి వస్తా
- బల్దియా కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌కు స్పందన
- హాజరైన అన్ని శాఖల అధికారులు



ఫోన్‌ఇన్‌కు హాజరైన కమిషనర్, అధికారులు

కోల్‌సిటీ(రామగుండం): 'సాక్షి దినపత్రిక చేపట్టిన ఫోన్‌ఇన్ కార్యక్రమానికి ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు వచ్చాయి.. వాటిని వెంటనే పరిష్కరించండి.. ప్రధానంగా దోమల నివారణకు నీటినిల్వలు, ఖాళీస్థలాల్లో పిచ్చిమొక్కలు తొలగించండి.. వాటి యజమానులకు నోటీసులు జారీచేయండి. పారిశుద్యం మరింత మెరుగుపర్చండి.. నేను కూడా క్షేత్రస్థాయిలో పర్యటిస్తా' అని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్ ఆదేశించారు. శనివారం కార్పొరేషన్ కమిషనర్‌తో 'సాక్షి' ఫోన్‌ఇన్ నిర్వహించింది. అన్ని విభాగాల ముఖ్య అధికారులు హాజరయ్యారు. 30మంది వరకు నగరవాసులు వివిధ సమస్యలపై కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. డివిజన్లలో చెత్త తొలగించడం లేదని, ఆటో రావడం లేదని, దోమలు, పందులు, కుక్కలు, కోతులు స్వైర విహారం చేస్తున్నాయని, దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయాలని, తాగునీటి ఇబ్బందులు తొలగించాలని, లేఅవుట్ కాలనీల్లో బురదరోడ్లపై డస్ట్ పోయించాలని, మ్యాన్‌హోళ్ల నుంచి మురుగునీటి లీకేజీ అరికట్టాలని విన్నవించారు. కమిషనర్ ఓపిగా వాటిని వింటూ రికార్డు చేసుకున్నారు. కొందరి మిస్డ్‌కాల్స్‌కు కమిషనరే స్వయంగా తిరిగి ఫోన్‌చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదారుల ఫోన్‌నంబర్లను అధికారులు నమోదు చేసుకొని వారితో నేరగా మాట్లాడాలని కమిషనర్ సూచించారు. డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు, ఎస్ఈ చిన్నారావు, డీఈలు జమీల్, హన్మంతు నాయక్, టీపీవో తిరుపతమ్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్యాం, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మా కాలనీలో డ్రైనేజీ సమస్య పరిష్కరించండి.
– రామస్వామి, టీచర్స్‌కాలనీ
కమిషనర్: ఆ ప్రాంతాన్ని పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం.

మాతంగి కాంప్లెక్స్ రోడ్డుపై కుక్కల బెడద ఉంది.
– దూడపాక మల్లేశ్, ఎల్బీనగర్
కమిషనర్: వాటికి కుటుంబ నియంత్రణ చేశాం. ప్రజలు రోడ్లపై ఆహార పదార్థాలు పడవేయొద్దు.

మూడు నెలుగా తాగునీరు రావడం లేదు.
– ప్రకాశం, సుభాష్‌నగర్
కమిషనర్: పరిష్కరించాలని అధికారులను వెంటనే ఆదేశించాం.

డివైడర్లపై రాజకీయ పార్టీల ప్రచార రాతలు తొలగించి, ప్రజలకు ఉపయోగపడే సందేశాలు రాయండి.
– ధూళికట్ట సతీశ్, గాంధీనగర్
కమిషనర్: పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

దుర్గానగర్ లేఅవుట్‌లో సీసీ రోడ్లు నిర్మించలేదు. బురదతో ప్రమాదాలకు గురవుతున్నాం. కనీసం డస్ట్ పోయించండి.
– ఆర్.విజయ, దుర్గానగర్
కమిషనర్: కార్పొరేషన్‌లో అందుబాటులో ఉన్న నిధులతో రోడ్డు నిర్మిస్తాం.

మ్యాన్‌హోల్ నిండి ఇండ్ల ముందు మురుగు పారుతంది.
– సురేశ్, వినోభనగర్
కమిషనర్: పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటాం.

ఇంటర్నల్ వాటర్ పైప్‌లైన్ కనెక్షన్లు ఇవ్వలేదు. వీధిలైట్లు లేవు.
– మహ్మద్, 1వ డివిజన్
కమిషనర్: సమస్యను వెంటనే పరిష్కరిస్తాం.

ఫాగింగ్‌లేక దోమలు వృద్ధి చెందుతున్నాయి.
– మొయినొద్దీన్, 21వ డివిజన్
కమిషనర్: డివిజన్‌లో ఫాగింగ్ చేయిస్తాం.

సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలు తీర్చండి.
– రమేశ్, సమ్మయ్య, సప్తగిరికాలనీ
కమిషనర్: మీ కాలనీని నేనే స్వయంగా పరిశీలించా. సమస్యలు పరిష్కరిస్తాం.

2017 నుంచి నల్లాబిల్లు క్రమంతప్పకుండా కడుతున్న. ఆన్‌లైన్‌లో బకాయిలు ఉన్నట్లు చూపిస్తున్నది.
– ఇబ్రహీం, విఠల్‌నగర్
కమిషనర్: ఆన్‌లైన్‌లో బకాయిలు లేకుండా చర్యలు తీసుకోవడానికి సీడీఎంఏకు లేఖ రాస్తాం.

గాంధీనగర్ కోర్టు ముందు మెయిన్ రోడ్డుపై రెండు విద్యుత్ స్తంభాలను నిర్లక్ష్యంగా వదిలేశారు. ప్రమాదాలు జరుగుతున్నాయి.
– పూర్మ శ్రీనివాస్, అడ్వకేట్
కమిషనర్: పరిష్కరించాలని అధికారులను ఆదేశిస్తాం.

కోర్టు ప్రహరీ సమీపంలో పందులు తిరుగుతున్నయి.
– ప్రవీణ్‌కుమార్, అడ్వకేట్
కమిషనర్: వెంటనే చర్యలు తీసుకుంటాం.

డివైడర్ల మధ్య నాటిన కోనోకార్పస్ మొక్కలు తొలగించి, పర్యావరణానికి మేలు చేసేవి నాటించండి.
– ప్రదీప్‌కుమార్, అడ్వకేట్
కమిషనర్: ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు. నాటిన మొక్కలు తొలగించడం లేదు. కొత్త వాటిని ఇప్పుడు నాటడం లేదు.

విద్యానగర్‌లో కోతుల బెడద తీవ్రంగా ఉంది. వరద కాలువ సమస్య పరిష్కరించండి.
– రాజ్‌కుమార్, విద్యానగర్–2
కమిషనర్: పరిశీలించి తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

ఐదు నెలలుగా తాగునీరు సరఫరా కావడం లేదు.
– శ్రీకాంత్, అన్నపూర్ణ కాలనీ
కమిషనర్: వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాం.

గోదావరి నది ఒడ్డున చెత్తపోసి అపరిశుభ్రంగా మారుస్తున్నారు.
– శ్రీధర్, అడ్వకేట్
కమిషనర్: చెత్త పోయకుండా చర్యలు తీసుకుంటున్నాం. మరోప్రాంతంలో డంపింగ్ యార్డు ఏర్పాటుకు స్థలం పరిశీలన చేస్తున్నాం.

తాగునీటి ప్రెషర్ తక్కువగా వస్తోంది. గంట కూడా నీళ్లు ఇవ్వడం లేదు.
– మహేశ్‌బాబు, నర్రశాలపల్లి
కమిషనర్: సమస్య పరిష్కరిస్తాం.

కార్పొరేషన్ కమిషనర్ స్పందనకు వందనం



దోమల నివారణ కోసం శనివారం డివిజన్‌లో ఫాగింగ్ చేస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

కోల్‌సిటీ: 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులపై కార్పొరేషన్ కమిషనర్ నాగేశ్వర్ వెంటనే స్పందించారు. పారిశుధ్యం పనితీరు మెరుగుపర్చేలా తక్షణ చర్యలు తీసుకున్నారు. ఫిర్యాదులు పరిష్కరించాలని ఆదేశించడంతో అధికారులు ఆగమేఘాలపై పరిష్కార చర్యలు చేపట్టారు. శనివారం సాయంత్రమే ఆయా ప్రాంతాలకు చేరుకున్నారు. పరిష్కార మార్గాలపై చర్యలు తీసుకున్నారు. గాంధీనగర్ కోర్టు ప్రహరీ పక్కన అపరిశుభ్రంగా మారిన ప్రాంతాన్ని బ్లేడ్ ట్రాక్టర్‌తో చదును చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. డివిజన్లలో ఫాగింగ్ చేయించారు. ఈ పనులను డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యాం తదితరులు పర్యవేక్షించారు.

చట్టాలపై అవగాహన అవసరం

జ్యోతినగర్(రామగుండం): చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు న్యాయమూర్తి శ్రీనివాసరావు సూచించారు. శనివారం ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్ జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. సమస్యలు ఎదురైనప్పుడు చట్టంలోని అంశాలను పరిగణనలోకి తీసుకుని సత్వర న్యాయం పొందేందుకు కోర్టులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జయరాజ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



న్యాయమూర్తిని సన్మానిస్తున్న సభ్యులు

క్లుప్తంగా

ఆయన కళ్లు సజీవం


కొమురయ్య(ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ: స్థానిక సంతోష్‌నగర్‌కు చెందిన ముప్పు కొమురయ్య (75) అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన నేత్రాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఐ టెక్నీషియన్ ఆరీఫ్ నేత్రాలు సేకరించి హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంకుకు తరలించారు. పుట్టెడు దు:ఖంలోనూ సమాజహితం కోసం మరో ఇద్దరికి చూపును ప్రసాదించాలనే సదుద్దేశంతో కొమురయ్య నేత్రాలు దానం చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన కుమారులు సంపత్ కుమార్, శ్రీనివాస్, కోడళ్లు సరిత, శ్రీలతను సదాశయ ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి సభ్యులు అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సుల్తానాబాద్‌రూరల్: పూసాలకు చెందిన ఉస్తేం శంకరయ్య(45) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై విజేందర్ కథనం ప్రకారం.. 15ఏళ్లక్రితం శంకరయ్య మొదటి భార్య చనిపోగా రెండో పెళ్లి చేసుకున్నాడు. మొదటి భార్య సంతానమైన ఇద్దరి కూతుళ్లకు వివాహం చేశాడు. 10నెలల క్రితం పెద్ద అల్లుడు ప్రమాదంలో మృతి చెందగా అప్పటి నుంచి మనస్తాపంతో ఉంటున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. మానసికంగా కుంగిపోయిన శంకరయ్య ఈనెల 21న ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగులమందు తాగాడు. కుటుంబసభ్యులు కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. భార్య జమున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

పేకాటరాయుళ్ల పట్టివేత

పెద్దపల్లిరూరల్: కూనారం క్రాస్ రోడ్డు ప్రాంతంలోని ఓ లాడ్జిలో పేకాట ఆడుతున్న 8మందిని పోలీసులు పట్టుకున్నారు. వారినుంచి రూ.27వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

జూలపల్లి(పెద్దపల్లి): మండల కేంద్రానికి చెందిన కొంజెర్ల మహేశ్ రేషన్‌కార్డు దారులకు పంపిణీ చేసిన బియ్యాన్ని కొనుగోలు.. తన పాత ఇంట్లో నిల్వచేశారు. ఆ తర్వాత అధిక ధరకు విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎస్సై వెంకటకృష్ణకు పాత ఇంట్లో తనిఖీలు చేశారు. ఈసందర్భంగా 5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం లభించాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ శంకర్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన ఆ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కుమ్మరికుంట రేషన్ డీలర్ ఈర్లస్వామికి అప్పగించారు. బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి, నిల్వచేసిన మహేశ్‌పై 6ఏ కేసు నమోదు చేసినట్లు డీటీ తెలిపారు.

బర్రెకుంట.. ఇక మోడల్ చెరువు

- రూ.70 లక్షలతో ఆధునికీకరణ
- నేడు అంబేడ్కర్, బుద్ధుడి విగ్రహాలు ప్రారంభం
- హాజరుకానున్న ఎంపీ, జెడ్పీ చైర్‌పర్సన్


విగ్రహాల వరకు వెళ్లేందుకు కర్రలతో నిర్మించిన తాత్కాలిక వంతెన

మంథని: చెత్తాచెదారంతో నిండి.. దుర్వాసన వెదజల్లుతున్న బర్రెకుంట ఇక మోడల్ అంబేడ్కర్ చెరువుగా త్వరలోనే ఆవిర్భవించనుంది. రూ.70 లక్షల వ్యయంతో చెరువును ఆధునీకరించే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రభుత్వం, పుట్ట లింగమ్మ ట్రస్టు ద్వారా నిధులు వెచ్చిస్తూ మినీ ట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దుతున్నారు. చెరువులో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, గౌతమ బుద్ధిడి విగ్రహాలను ఆదివారం ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత, జెడ్పీ చైర్మన్ పుట్ట మధు ఆవిష్కరిస్తారు.

కంపు నుంచి విముక్తి

- పిచ్చిమొక్కలు, మురుగునీరు, చెత్తాచెదారంలో దుర్వాసన వెదజల్లే బర్రెకుంటకు సమీపంలోనే సుమారు 250 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి.
- ఆ కాలనీని బర్రెకుంటగానే పిలిచేవారు. కుంట దాటాలంటే ముక్కు మూసుకోవాల్సిందే.
- దాని సమీపంలోకి వచ్చాక పరుగు పెట్టకుంటే ఆ కంపు భరించే పరిస్థితి ఉండేదికాదు.
- అక్కడ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు, దళితులే అధికంగా ఉండేవారు.
- చాలాకాలంగా అభివృద్ధికి నోచుకోలేదు.
- జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు చొరవతో బర్రెకుంటను అంబేడ్కర్‌నగర్‌గా నామకరణం చేయడంతోపాటు చెరువును ఆధునికీకరించేందుకు దత్తత తీసుకున్నారు.

రూ.70 లక్షలతో ఆధునికీకరణ పనులు

బర్రెకుంట ఆధునికీకరణకు ప్రభుత్వంతోపాటు పుట్ట లింగమ్మ ట్రస్టు ద్వారా రూ.70లక్షలు వెచ్చించేందుకు ప్రణాళిక రూపొందించారు. వీటిని వెచ్చించి కుంటలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు, చెత్తచెదారం తొలగించి చదును చేశారు. పూడిక తొలగించి ఇరువైపులా కట్ట, దానిపై రోడ్డు నిర్మించారు. సమీపంలోని బన్నెచెరువు నుంచి అంబేడ్కర్ చెరువు వరకు ప్రత్యేక పైపులైన్ నిర్మించి నీటిని మళ్లిస్తున్నారు. చుట్టూ లైటింగ్ ఏర్పాటు చేశారు. చెరువులో అంబేడ్కర్, గౌతమ బుద్ధుని విగ్రహాలు ఏర్పాటు చేశారు. సెంట్రల్ లైటింగ్ సిస్టమ్, వాటర్ ఫాల్స్ అమర్చుతారు. చుట్టూ పార్కింగ్ టైల్స్, వాకింగ్ ట్రాక్, పార్క్, తదితర అభివృద్ధి పనులు చేస్తారు. కాగా, చెరువులో ఏర్పాటు చేసిన విగ్రహాల వరకు వెళ్లేందుకు కర్రలతో తాత్కాలిక వంతెన నిర్మించారు.

కంపు భరించలేకున్నం



బర్రెకుంటకు సమీపంలో నివాసముండే వారంతా కంపుతో కాలం వెళ్లదీసేటోళ్లం. ఎవరూ ఇటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేవు.

– ఆరెపల్లి కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్, మంథని

దోస్తులను పిలవలేకపోయినం



మా కాలనీకి దోస్తుగాళ్లను తీసుకు రావాలంటే ఇబ్బందిగా ఉండేది. గిప్పుడు వాళ్లే వచ్చేలా ఉంది. ముక్కు మూసుకోకుండా కుంట దాటేవాళ్లం కాదు. ఇండ్లల్లోకి కూడా కంపు వాసన వచ్చేది.

– మంథని బాలకృష్ణ, అంబేడ్కర్‌నగర్, మంథని

పరుగున దాటేది



బ్రిడ్జి నుంచి మా కాలనీ మధ్య రోడ్డు వరకు దుర్వాసన వచ్చేది, రోడ్డు పొడవునా తుమ్మ చెట్లు ఉండేవి. కనీసం నడవలేకుండా ఉండేది. నేడు పరిస్థితులు మారిపోయాయి. కుంట ఆనవాళ్లు పోయినయి. ఆధునికీరణ పనులు సాగుతున్నాయి.

– బూడిద వెంకటేశ్, సింగరేణి కార్మికుడు, మంథని

పేద మహిళకు ఇల్లు బహుమతి



ఇంటి వద్ద ఎమ్మెల్యే చందర్, నాయకులు

- పుట్టినరోజు సందర్భంగా ఎమ్మెల్యే చందర్ నిర్ణయం

గోదావరిఖని: తనపుట్టిన రోజు కానుకగా రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పేద మహిళకు ఇంటిని నిర్మించి బహుమతిగా అందించారు. స్థానిక 37వ డివిజన్ చంద్రశేఖర్‌నగర్‌కు చెందిన కొండ రాజేశ్వరికి ఆ ఇంటిని అప్పగించారు. మంత్రి కేటిఆర్ ×గిఫ్ట్ ఏ స్మైల్₹ పిలుపు మేరకు ఇల్లు నిర్మించి అందించినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసమే నిరంతరం కృషి చేస్తున్నానని అన్నారు. పేదల జీవితాల్లో ఆనందం నింపాలంటే సమాజంలో మంచిని పెంచే స్ఫూర్తిదాయక కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నడిపల్లి అభిషేక్‌రావు, కార్పొరేటర్లు పెంట రాజేశ్, పాముకుంట్ల భాస్కర్, నాయకులు చెలుకలపల్లి శ్రీనివాస్, జేవీరాజు, మెతుకు దేవరాజ్, దొమ్మేటి వాసు, చెలుకలపల్లి సతీశ్, అడప శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జయదుర్గాదేవి ఆలయంలో పూజలు

ప్రజలు సుఖ, సంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ స్థానిక జవహర్‌నగర్ జయదుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి హోమం చేశారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ అఖండ మెజార్టీతో గెలవాలని, సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా పాలనసాగించాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు.

50కిలోల కేక్‌కట్ చేసిన నాయకులు

ఎమ్మెల్యే చందర్ జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నాయకులు 50 కేజీల కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచిపెట్టారు. పలుచోట్ల అన్నదానాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

బాగా చదువుకుంటున్నారా..?

- మధ్యాహ్న భోజనం ఎలా ఉంటోంది?
- కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలి
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- అప్పన్నపేట జెడ్పీ హైస్కూల్ సందర్శన


విద్యార్థులు, టీచర్లతో మాట్లాడుతున్న కలెక్టర్

పెద్దపల్లిరూరల్: 'పిల్లలూ.. ఎలా చదువుతున్నారు..? మీ టీచర్ చెప్పే పాఠాలు అర్థమవుతున్నాయా? మధ్యాహ్న భోజనం రుచి, శుచిగా అందిస్తున్నారా?' అని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆరాతీశారు. అప్పన్నపేట జెడ్పీ హైస్కూల్‌లో శనివారం జరిగిన పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు ఆయన హాజరయ్యారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్డు, అరటిపండు ఇవ్వడం లేదని విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కష్టపడి చదివి, ఎంచుకున్న లక్ష్యసాధనలో ముందుండాలన్నారు. సులువుగా అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేస్తూ విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. చదువుపైనే కాకుండా వినోద కార్యక్రమాలకు కొంత సమయం కేటాయించాలని చెప్పారు. ఆంగ్ల భాషపై ఎక్కువ పట్టుసాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. తమ పిల్లలను బడికి పంపితేనే బాధ్యత తీరిందనే రీతిలో తల్లిదండ్రులు ఉండొద్దని, పిల్లలు ఏంచదువుతున్నారు.. ఎలా ఉంటున్నారు.. తదితర అంశాలు గమనించాలని తల్లిదండ్రులకు సూచించారు. చదువులో వెనకబడ్డ విద్యార్థులను గుర్తించి ప్రత్యేక విద్యాబోధన చేయాలని హెచ్‌ఎం పురుషోత్తం, ఉపాధ్యాయులకు సూచించారు. సర్పంచ్ చీకటి స్వరూప, మాజీ ఉపసర్పంచ్ చీకటి పోచాలు, గ్రామస్తులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చందర్‌ను 50వేల మెజార్టీతో గెలిపించండి

- మంత్రి టి.హరీశ్‌రావు
- బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు


బీఆర్ఎస్‌లో చేరిన నాయకులతో మంత్రి హరీశ్

గోదావరిఖని: రామగుండం నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ని 50 వేల మెజార్టీతో గెలిపించాలని మంత్రి హరీశ్‌రావు కోరారు. శనివారం హైదరాబాదులో రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సమక్షంలో మాజీ డిప్యూటీ మేయర్, బీజేపీ నాయకుడు ముప్పిడి సత్యప్రసాద్, మాజీ కార్పొరేటర్లు షమీమ్‌సుల్తానా, హైమద్‌బాబు, వనం శివానందం, బాబుమియా, బొబ్బిలి సతీశ్, కత్తెరమల్ల రమేశ్‌తోపాటు పలువురు పార్టీలో చేరగా వారికి మంత్రి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావడం ఖాయమన్నారు. డిప్యూటీ మేయర్ నడిపల్లి అభిషేక్‌రావు, రామగుండం నియోజకవర్గ చేరికల కమిటీ సభ్యుడు జాహిద్‌పాషా, నాయకులు కందుల సతీశ్, నారాయణదాసు మారుతి తదితరులు పాల్గొన్నారు.

చేయూత ఇవ్వండి


మంత్రి కేటీఆర్‌తో పుట్ట మధు

మంథని: నియోజకవర్గ అభివృద్ధికి మరింత చేయూత అందించాలని ఐటీ మంత్రి కేటీఆర్‌ను జెడ్పీ చైర్మన్ పుట్ట మధు కోరారు. శనివారం హైదరాబాద్ ప్రగతి భవన్‌లో మంత్రిని ఆయన కలిశారు. అనేకమంది పేదలు సొంతిళ్లు లేకఇబ్బంది పడుతున్నారని, గృహలక్ష్మి కింద మంథని నియోజకవర్గానికి అదనంగా వెయ్యి ఇళ్లు కేటాయించాలని కోరారు. భూపాలపల్లిలో డీటీడబ్ల్యూ కార్యాలయం ఏర్పాటు చేయాలన్నారు. కమాన్‌పూర్ ఆదివరహస్వామి ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలని విన్నవించారు. జక్కు రాకేశ్, తిరుపతి పటేల్ తదితరులు ఆయనతో ఉన్నారు.

మధూకర్ కేసులో నిందితులను అరెస్టు చేయాలి

మంథని: ఖానాపూర్ గ్రామానికి చెందిన మంథని మధూకర్ కేసులో నిందితులను అరెస్టు చేయాలని ఢిల్లీలోని లోక్ నాయక్ భవన్‌లో జాతీయ, రాష్ట్ర మాలమహానాడు నాయకులు శనివారం జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఇన్‌చార్జి చైర్మన్ అరుణ్ హెల్డీని కలిసి వినతిపత్రం అందించారు. ఆరు సంవత్సరాలు గడుస్తున్నా కేసులో పోలీసులు ప్రగతి సాధించలేకపోయారన్నారు. తెలంగాణ హైకోర్టులో కౌంటర్ దాఖలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి బైరి రమేశ్, రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, ఉపాధ్యక్షుడు జూపాక సుధీర్, ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటస్వామి, కో ఆర్డినేటర్ శ్రీరాములు, జైభీమ్ సేవా సైనిక్‌దళ్ రాష్ట్ర అధ్యక్షుడు అసాది పురుషోత్తం, నాయకులు లక్ష్మణ్, శరత్, తదితరులు ఉన్నారు.

చంద్రబాబుకు జైలు శిక్షపై హర్షం

- గుండు గీయించుకున్న వైఎస్సార్ సీపీ లీడర్



గోదావరిఖని: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును జైలుకు పంపించడాన్ని హర్షిస్తూ నగరానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత ఒ.లూర్ధ్‌రెడ్డి శనివారం తన గుండు గీయించుకున్నారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అరెస్టు సమయంలో చంద్రబాబు నాయుడు పైశాచిక ఆనందరం పొందారని గుర్తుచేశారు. ఇప్పుడు బాబే జైలు పాలయ్యారని విమర్శించారు. ఆయన చేసిన కుంభకోణాలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి జైల్లో నుంచి బయటకు రాకుండా చూడాలని ఆయన కోరారు.

టీఎస్‌ఐపాస్ అనుమతులు ఇవ్వండి

పెద్దపల్లిరూరల్: జిల్లాలో పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకొచ్చే యువత టీఎస్‌ఐపాస్ కింద చేసుకున్న దరఖాస్తులకు సత్వరమే అనుమతులివ్వాలని అడిషనల్ కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్ సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. టీఎస్ ఐపాస్ అమలుతీరుపై ఆరా తీశారు. కొత్త పరిశ్రమల ఏర్పాటు కోసం వచ్చిన 22 ప్రతిపాదనల్లో 18 ప్రతిపాదనలకు జారీచేసిన అనుమతులను సమీక్షించారు. టీ ప్రైడ్ పథకం కింద ఎస్సీ, ఎస్టీ సేవా రంగ ఐదు యూనిట్లకు రూ.16.68 లక్షల పెట్టుబడి రాయితీ మంజూరు చేశామని తెలిపారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం మధుసూదనాచారి, లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేశ్, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ మధుసూదనశర్మ, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, విద్యుత్ శాఖ డీఈ రవి తదితరులు పాల్గొన్నారు.

జనవరిలోగా వినియోగంలోకి తీసుకురావాలి

గోదావరిఖని: జనవరి చివరిలోగా మురుగునీటి శుద్ధి ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ ఆదేశించారు. శనివారం మురుగునీటిని శుద్ధి ప్లాంట్‌ను ఆయన పరిశీలించారు. 17ఎంఎల్‌డీ మురుగు నీటిని శుద్ధిచేసే భారీ ప్లాంట్ పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. ఇది పూర్తయితే వివిధ కాలనీల నుంచి వచ్చే మురుగు నీటిని శుద్ధి చేసి పలు అవసరాలకు వినియోగించే వీలుంటుందని చెప్పారు. ఆధునిక సాంకేతికత పద్ధతి ద్వారా మురుగు నీటిని శుద్ధిచేసి మంచినీరుగా మార్చి ప్రజావసరాలకు వినియోగిస్తామన్నారు. జీఎం వెంట ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజనేయప్రసాద్, సివిల్ డీజీఎం నాగేశ్వర్‌రావు, సీనియర్ సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి తదితరులు ఉన్నారు.

27న మద్యం దుకాణాలు బంద్

గోదావరిఖని: గణేశ్ నిమజ్జనం సందర్భంగా జిల్లాలో మద్యం దుకాణాలు మూసివేయాలని శనివారం ఆదేశాలు జారీ అయ్యాయి. ఈమేరకు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాలోని పెద్దపల్లి, రామగుండం, సుల్తానాబాద్‌లో ఈనెల 27న ఉదయం 6గంటల నుంచి ఈనెల 28న ఉదయం 6గంటల వరకు వైన్‌షాపులు మూసివేయాలని సూచించారు. మంథనిలో ఈనెల 28న ఉదయం 6గంటల నుంచి 29న ఉదయం 6వరకు మద్యం దుకాణాలు మూసివేయాలని ఆదేశించారు.

దీక్షలు ప్రారంభించిన సీపీఎం నేత

మంథని: తమ సమస్యల పరిష్కారానికి 13 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు శనివారం రిలే నిరాహార దీక్షలకు పూనుకున్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.యాకయ్య ఈ దీక్షలు ప్రారంభించారు. అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆయన విమర్శించారు. సమ్మెతో గ్రామీణ ప్రాంతాల్లో పౌష్టికాహారం పంపిణీ ఆగిపోయి గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నాయకులు బూడిద గణేశ్, సందీప్, రవి తదితరులు పాల్గొన్నారు.

కరెన్సీ గణపతి



సుల్తానాబాద్(పెద్దపల్లి): స్థానిక ఆర్య వైశ్య భవన్‌లో శనివారం రూ.9,99,999 కరెన్సీ నోట్లతో వినాయకుని విగ్రహాన్ని అలంకరించారు. భక్తులను ఆకట్టుకుంటున్న గణనాథుడిని రూ.100, రూ.50, రూ.20 నోట్లతో అలంకరించి పూజిస్తున్నారు. ఆర్యవైశ్యులు, కాలనీలవాసులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

మక్కాన్‌సింగ్ పూజలు



గోదావరిఖనిటౌన్: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ శనివారం పలు కాలనీలల్లోని వినాయక మంటపాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. గణపతి ఆశీస్సులతో ప్రజలు సుఖ, సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం అన్నదానం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కాల్వ లింగస్వామి, కార్పొరేటర్లు గాదం విజయనందు, ముస్తఫా, నాయకులు యుగంధర్, తిప్పారపు శ్రీనివాస్, కౌటం సతీశ్, పంజా శ్రీను, ధూళికట్ట సతీశ్, శివ, దాసరి విజయ్, అనుమ సత్తి, కీర్తి నాగరాజు, ఆడెపు దశరథం, మేకల పోచం, ప్రవీణ్, కిరణ్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

గోదావరిఖనిటౌన్: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) ద్వారా లేబర్ కార్డు కలిగిన భవన నిర్మాణ రంగ కార్మికులకు 15 రోజుల శిక్షణ ఇస్తామని సెంటర్ ఇన్‌చార్జి బి.సంపత్ శనివారం తెలిపారు. శిక్షణ కాలంలో రోజుకు రూ.300ఉపకార వేతనం, మధ్యాహ్న భోజనం, టీ షర్ట్, బ్యాగ్, స్టేషనరీ అందిస్తామని, శిక్షణ పూర్తయ్యాక సర్టిఫికెట్ ప్రదానం చేస్తామన్నారు. ఆసక్తి గలవారు లేబర్, ఆధార్‌కార్డు, బ్యాంక్ ప్రూఫ్, రేషన్‌కార్డు జిరాక్స్, మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో గంగానగర్‌లోని న్యాక్ శిక్షణ కేంద్రంలో ఈనెల 25న సంప్రదించాలన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్


నైవేద్యం సమర్పిస్తున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని: సంస్థ అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ కోరారు. శనివారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణపతికి 108రకాల నైవేద్యాలను సమర్పించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎస్‌వోటూ జీఎం రాంమోహన్, ఏజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణ, ఎన్విరాన్‌మెంట్ అధికారి అంజనేయప్రసాద్, అధికారులు ప్రభాకర్, బాలసుబ్రహ్మణ్యం, ధనలక్ష్మీబాయి, సాంబశివరాజు, వీరారెడ్డి, హనుమంతరావు, దేవాచారి పాల్గొన్నారు.

కాంగ్రెస్ టికెట్ కోసం వినతి



ధర్మారం: ధర్మపురి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్ కేటాయించాలని కోరుతూ మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ బొల్లిస్వామి ఏఐసీసీ జాతీయ కో ఆర్డినేటర్ కొప్పుల రాజును కలిసి వినతి పత్రం అందించారు. శనివారం న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజును ఆయన కలిసి తనకు టికెట్ ఇవ్వాలని కోరారు. తాను స్థానికుడనని, ప్రధాన రాజకీయ పార్టీల నుంచి స్థానికేతరులు పోటీ చేస్తున్నందున తనకు గెలిచే అవకాశాలు ఉన్నాయని ఆయన వివరించారు.

గనిపై ప్రత్యేక పూజలు



గోదావరిఖని: ఆర్జీ–1 సేవా సభ్యులు జీడీకే–11గని అమ్మవారి ఆలయంలోని గణపతి విగ్రహానికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సేవా అధ్యక్షురాలు చింతల లక్ష్మి, భక్తులు పద్మ, వరలక్ష్మి, సావిత్రి, అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుడి మృతి



ఓదెల(పెద్దపల్లి): కొలనూర్ గ్రామపంచాయతీ కార్మికుడు బషీర్(45) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. అకస్మాత్తుగా అస్వస్థతకు గురైన బషీర్‌ను స్థానికులు ఆస్పత్రికి తరలించగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడి కుటుంబాన్ని పెద్దపల్లి మార్కెట్ వైస్‌చైర్మన్ ఐరెడ్డి వెంకటరెడ్డి, సర్పంచ్ సామ మణెమ్మ, రైతు సమన్వయ సమితి డైరెక్టర్ బండారి ఐలయ్య యాదవ్, ఉపసర్పంచ్ పాకాల సంపత్‌రెడ్డి, ఆర్ఎంపీ సిరిశెటి సత్తిబాబు, వార్డుసభ్యులు, నాయకులు పరామర్శించారు.

రక్షణలో ప్రథమ స్థానం



రామగిరి: సింగరేణిలో నిర్వహించే రక్షణ వారోత్సవాల్లో ఆర్జీ–3 డివిజన్ సెంటినరీకాలనీ 132 కేవీ సబ్‌స్టేషన్ ప్రథమ బహుమతి సాధించింది. సింగరేణిలోని 4 విద్యుత్ సబ్ స్టేషన్‌లను అధికారులు పరిశీలించగా.. సెంటినరీకాలనీ 132 కేవీ సబ్‌స్టేషన్ పనితీరు అద్భుతంగా కనిపించింది. దీంతో ప్రథమ స్థానం దక్కింది. నిర్వహణ, ప్రమాదాల నివారణ, తక్కువ విద్యుత్ కోతలు తదితర ప్రామాణికాలను పరిగణనలోకి తీసుకుని రక్షణపై బహుమతులు అందజేస్తారు. డీజీఎం దూప్‌సింగ్, డీవైఎస్‌ఈ నరసింహస్వామి, సిబ్బందిని ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావు, ఎస్‌వోటూ జీఎం రఘుపతి, ఈఅండ్‌ఎం ఏజీఎం ఎలీషా అభినందించారు.